క్లుప్తంగా

బాలికపై అత్యాచార యత్నం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలికపై యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మంగళవారం బాలిక కుటుంబ సభ్యులు ఊరు వెళ్లడంతో గమనించిన పక్కింటి యువకుడు బాలిక ఇంట్లోకి వెళ్లి కొబ్బరినూనె కావాలంటూ అడుగుతూ బాలికపై అత్యాచారయత్నానికి ప్రయత్నించగా బాలిక అరుపులు పెడుతూ బయటకు రావడంతో యువకుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. బాలిక కుటుంబ సభ్యులకు ఫోన్‌లో జరిగిన విషయం చెప్పడంతో గ్రామానికి చేరుకున్న తల్లిదండ్రులు యువకుడిని ప్రశ్నించారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య గొడవ చోటు చేసుకుంది. 100 డయల్ చేయడంతో పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. బుధవారం బాలిక తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గుంత పూడ్చాలి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని మెదక్ – జోగిపేట ప్రధాన రహదారి చిన్నఘనాపూర్ గ్రామ శివారులోని గోలు బావి, కల్వర్టుకు మధ్యలో ఉన్న రహదారిపై తారు లేచిపోయి పెద్దపాటి గుంత ఏర్పడింది. వర్షాకాలం కావడంతో అందులో నీరు నిలిచి అటువైపు ప్రయాణం సాగించే వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆర్ అండ్ బీ అధికారులు వెంటనే స్పందించి గుంతను పూడ్చాలన్నారు.

ఫైర్ ఇన్‌స్పెక్టర్‌గా కొండాపూర్ యువకుడు ఎంపిక


ప్రశాంత్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఎస్.కొండాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి ప్రశాంత్ ఫైర్ ఇన్‌స్పెక్టర్‌గా సెలక్ట్ అయ్యాడు. ఇటీవల ప్రకటించిన ఎస్‌ఐ ఫలితాల్లో 255 మార్కులతో ఎంపికయ్యాడు. బీటెక్ పూర్తి చేసిన ప్రశాంత్ యూపీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రశాంత్ తల్లిదండ్రులు శ్యామ్, పుష్పలత హర్షం వ్యక్తం చేశారు.

మాకు న్యాయం చేయండి సార్


పోలీస్‌స్టేషన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

చిన్నశంకరంపేట(మెదక్): సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేసి న్యాయం చేయాలని ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తర్పేద్, దుర్గా కోరారు. మెదక్‌లో సీఎంను కలిసి వినతిపత్రం అందిస్తామని కోరితే పోలీస్‌లు అరెస్ట్ చేసి చిన్నశంకరంపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 120 మంది సెకండ్ ఏఎన్ఎంలు ఉన్నారని, ప్రభుత్వం ఇప్పటికి వేలాది మందిని రెగ్యులరైజ్ చేసిందన్నారు. అరెస్ట్ అయిన వారిలో యాదమ్మ, నవనీత, సులోచన తదితరులు ఉన్నారు.

నర్సాపూర్ మీదుగా మెదక్ వెళ్లిన సీఎం

నర్సాపూర్: సీఎం కేసీఆర్ బుధవారం నర్సాపూర్ మీదుగా మెదక్ వెళ్లారు. కాగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సీఎంకు స్వాగతం పలికేందుకు పట్టణంలోని చౌరస్తాకు ప్రజలు వచ్చారు. చౌరస్తా వద్దకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎక్కువ మంది రావడంతో అంతా రసాభసాగా మారింది. పార్టీ శ్రేణులకు సీఎం కేసీఆర్ బస్సులో నుంచి అభివాదం చేశారు. కాగా సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సీఎం వచ్చిన బస్సులో ఎక్కగానే బస్సు బయలు దేరింది. కొందరు నాయకులు బస్సు ఎక్కేందుకు ప్రయత్నించగానే సీఎం సెక్యూరిటీ వారిని అడ్డుకున్నారు.

అభ్యర్థులకు వైద్య పరీక్షలు

మెదక్‌మున్సిపాలిటీ: పోలీస్ శాఖలో వివిధ విభాగాల్లో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 26 నుంచి 28 వరకు వైద్య ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తారని రాజన్న సిరిసిల్ల డీఐజీ రమేశ్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఈ నెల 25 సాయంత్రం 5 వరకు కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని సీఏఆర్‌సీపీ, ఆర్ఐ అడ్మిట్ ఎదుట హాజరు కావాలన్నారు.

ముందస్తు అరెస్టులు సరికావు

రేగోడ్(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. తెల్లవారు జామున మూడు గంటల నుంచి పలువురు నాయకులను అరెస్ట్ చేయడం సరికాదని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, పార్టీ మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు.

పాఠశాలలో చంద్రయాన్‌-3 సంబరాలు

జిల్లా వ్యాప్తంగా బుధవారం చంద్రయాన్‌–3 ల్యాండర్ సురక్షితంగా ల్యాండ్ కావడంతో సంబురాలు చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో, పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులు చంద్రయాన్‌–3 ల్యాండింగ్‌ను వీక్షించారు. అనంతరం జాతీయజెండాను ప్రదర్శించారు. మండల కేంద్రం చేగుంటలో బీజేపీ నాయకులు, యువకులు టపాకాయలను కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు.


పెద్దశంకరంపేట(మెదక్): కస్తూర్బాలో చంద్రయాన్‌-3 ని వీక్షిస్తున్న విద్యార్థులు


వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో..


శివ్వంపేట(నర్సాపూర్): నవాబుపేటలో..


కొడిపల్లి ఎస్టీ గురుకుల పాఠశాలలో..

దళితబంధు రాలేదని ఆత్మహత్యాయత్నం

ఫినాయిల్ తాగిన దేవయ్య

టేక్మాల్(మెదక్): దళితబంధు తనకు ఇవ్వడం లేదని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి సీఎం కేసీఆర్ సభకు వెళ్లే బస్సు ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం సాలోజిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బేగరి దేవయ్య మాట్లాడుతూ.. జీవనోపాధికి ఎలాంటి సదుపాయం లేకపోవడంతో ప్రభుత్వం ఇస్తున్న దళితబంధుకు దరఖాస్తు చేసుకున్నాడని అన్నారు. గుంట భూమి లేని తనకు జీవనోపాధి కోసం పని


ఫినాయిల్ తాగి తన బాధను చెబుతున్న దేవయ్య

కెళ్దామంటే ఆరోగ్యం సహకరించడం లేదు. తనకు దళితబంధు వర్తింపజేయాలని కోరితే.. ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ చేసినా.. పట్టించుకోవడం లేదన్నారు. తన ఆరోగ్యం సహకరించలేదని, కనీసం నడవడానికి సైతం ఇబ్బందికరంగా ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో మనస్తాపానికి గురై ఫినాయిల్ తాగినట్లు తెలుపుతూ పడిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న ఏఎస్ఐ తుక్కయ్య సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లడానికి ప్రజాప్రతినిధులేవరు రాకపోవడంతో అక్కడున్న విలేకర్లు టేక్మాల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు వీరప్ప ఆస్పత్రికి వెళ్లి అతని ఆరోగ్యపరిస్థితి తెలుసుకున్నారు.

ఘనంగా బోనాలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో మహంకాళి, పోచమ్మల అమ్మవార్లకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం గ్రామ సర్పంచ్ ప్రభావతి ఆధ్వర్యంలో అమ్మవారికి మహిళలు పూజలు చేసి, బోనాలు సమర్పించారు. యువకులు తొట్టెల కార్యక్రమాన్ని వేడుకగా నృత్యాలతో ఊరేగించి, మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రభావతి, ఉపసర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సంజీవ, చంద్రశేఖర్‌రెడ్డి, ఆత్మకమిటీ డైరెక్టర్ రాంరెడ్డి, గ్రామస్తులు, పెద్దలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ మల్లయ్య మృతి

రేగోడ్(మెదక్): మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుర్మ మల్లయ్య (80) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈయన 1980లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ నిర్వహించిన కిసాన్ ర్యాలీకి మెదక్ రైతులకు ఢిల్లీకి ఆహ్వానించగా మల్లయ్య వెళ్లారు. అప్పటి నుంచి మల్లయ్య ఇందిరా మల్లయ్య, ఢిల్లీ మల్లయ్యగా స్థానికంగా గుర్తింపు పొందారు. మల్లయ్య మృతిపై పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, పార్టీ అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, కో ఆప్షన్ చోటుమియా, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ సంతాపం ప్రకటించారు.

డిప్యూటేషన్ నిలిపివేయాలని నిరసన


అనంతసాగర్ పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

చేగుంట(తూప్రాన్): తాత్కాలిక డిప్యూటేషన్ పేరుతో ఉపాధ్యాయురాలిని తరలించడంపై అనంతసాగర్ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకుడు సిద్ధిరాములు మాట్లాడుతూ.. అనంతసాగర్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు జ్యోతిర్మయిని బోనాల్ పాఠశాలకు పంపడంతో స్థానిక విద్యార్థులు నష్టపోతారని ఆరోపించారు. డిప్యూటేషన్ నిలిపివేసి ఉపాధ్యాయురాలిని తమ పాఠశాలలోనే విధులు నిర్వర్తించేలా చేయాలని, లేదంటే మండల కేంద్రంలో గ్రామస్తులతో పెద్ద ఎత్తున రస్తారోకో చేస్తానని హెచ్చరించారు. అనంతరం గ్రామ పంచాయతీ నుంచి జిల్లా విద్యాధికారికి డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని వినతిపత్రం పంపించారు. ఈ కార్యక్రమంలో శంకర్, సత్యనారాయణ, పోచయ్య, గ్రామ నాయకులు ఉన్నారు.

ప్రశ్నించే గొంతుకల అరెస్టు

కొల్చారం(నర్సాపూర్): మెదక్ లో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యట నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. అరెస్టుపై ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కుర్ర ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు, ప్రశ్నించే గొంతుకలపై ఉన్న శ్రద్ధ, దళితుల అభివృద్ధిపై లేదన్నారు. కేసీఆర్‌కి దమ్ముంటే దళితులకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు, దళిత బంధు ఇవ్వాలన్నారు. ఇప్పుడు వచ్చే ఎన్నికల్లో దళితులు ఓటుతో యుద్ధానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మెదక్ బహిరంగ సభలో రంగంపేటను మండల కేంద్రంగా ప్రకటించాలన్నారు.


టేక్మాల్(మెదక్): అరెస్ట్ అయిన కాంగ్రెస్ నాయకులు


చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్‌లో కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు


రామాయంపేట పోలీసుల అదుపులో నాయకులు

నాయకుల ముందస్తు అరెస్ట్

జిల్లా వ్యాప్తంగా బుధవారం మెదక్ సీఎం కేసీఆర్ సభను అడ్డుకోవడానికి వెళ్తున్న వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలను ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు అరెస్ట్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ, కాంగ్రెస్, సీఐటీయూ, ఎబీవీపీ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఉన్నారు. నాయకులను అరెస్టు చేయడం సరికాదని పలువురు వక్తలు అన్నారు.


చిన్నశంకరంపేట పోలీస్‌లు అరెస్ట్ చేసిన మైనంపల్లి వర్గీయులు


మనోహరాబాద్ వద్ద బీఆర్ఎస్ నాయకులతో జడ్పీ చైర్ పర్సన్ ర్యాకల హేమలత


రామాయంపేట(మెదక్): నార్సింగి నుంచి మెదక్ తరలిన బీఆర్ఎస్ కార్యకర్తలు

మెదక్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు


తూప్రాన్‌లో..

జిల్లా వ్యాప్తంగా బుధవారం మెదక్‌లో జరిగిన సీఎం కేసీఆర్ సభకు ఆయా గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో, ప్రైవేట్ వాహనాల్లో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు తరలివెళ్లారు.


శివ్వంపేటల నుంచి మెదక్ తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

సభ హైలెట్స్

హవేళీఘనపూర్: మెదక్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన సీఎం పర్యటన ఇలా కొనసాగింది..

- హైదరాబాద్ ప్రగతిభవన్ నుంచి సీఎం కేసీఆర్ రోడ్డు మార్గంలో బయల్దేరారు.
- మధ్యాహ్నం 1 గంటకు గుమ్మడిదలలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు.
- అక్కడి నుంచి నేరుగా నర్సాపూర్, కొడిపల్లి మీదుగా మెదక్‌కు మధ్యాహ్నం 3 గంటలకు చేరుకున్నారు.
- మెదక్‌లో జరిగే కార్యక్రమానికి సీఎం కేసీఆర్, మంత్రులు, జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రత్యేక బస్సులో చేరుకున్నారు.
- సీఎంకు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు.
- జిల్లాలోని ప్రధాన చౌరస్తాల వద్ద సీఎం కేసీఆర్‌పై పూలవర్షం కురిపించారు
- సీఎం కేసీఆర్ మధ్యాహ్నం 1 గంటకు రావాల్సిఉండగా 3 గంటలకు చేరుకున్నారు.
- ముందుగా జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభోత్సవం చేశారు.
- జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లిన సీఎం కేసీఆర్‌కు పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం కార్యాలయాన్ని ప్రారంభించారు.
- అనంతరం కలెక్టరేట్ సమీకృత భవనాన్ని ప్రారంభించి కలెక్టర్ రాజార్షిషాను కుర్చీలో కూర్చోబెట్టారు.
- 4.30 గంటల అనంతరం సీఎం కేసీఆర్ జిల్లా అధికారులతో సమావేశమై జిల్లా అభివృద్ధిపై పలు సూచనలు చేశారు.
- సభావేదిక వద్దకు జనం రాలేదన్న సమాచారం తెలుసుకున్న సీఎం కేసీఆర్ 5 గంటల తర్వాత సీఎస్ఐ చర్చి కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు.
- రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తానని సీఎం కేసీఆర్ హామీఇచ్చారు.
- ఆటపాటలతో కళాకారులు ఆకట్టుకున్నారు
- సీఎం కేసీఆర్ పర్యటన దృష్ట్యా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.
- సీఎం పర్యటన విజయవంతంగా ముగియడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఊపిరి పీల్చుకున్నారు.

రెవెన్యూ డివిజన్ కల సాకారం

- రామాయంపేటపై వరాల జల్లు కురిపించిన సీఎం
- రెవెన్యూ డివిజన్‌తోపాటు డిగ్రీ కళాశాల మంజూరు


రామాయంపేటలో టపాకాయలు కాల్చి హర్షం వ్యక్తం చేస్తున్న అఖిలపక్షం ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): రామాయంపేట రెవెన్యూ డివిజన్ కల ఎట్టకేలకు సాకారమైంది. డివిజన్ కోసం ఆరేళ్లుగా స్థానికులు, కుల సంఘాలు, అఖిలపక్షం ప్రతినిధులు, యువజన సంఘాలు చేస్తున్న దీక్షలు, నిరసనలతో స్పందించిన ప్రభుత్వం డివిజన్ మంజూరు చేసింది. ఈ విషయమై మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పలుమార్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సీఎం మెదక్ సమావేశంలో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పద్మ తన కూతురు లాంటిదని, ఆమె కోరిక మేరకు రామాయంపేటకు రెవెన్యూ డివిజన్‌తో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మున్సిపాలిటీ అభివృద్ధికై రూ. 25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం సభాముఖంగా ప్రకటించారు. డివిజన్ విషయమై రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించారు. దీనితో అన్ని పార్టీల నాయకులతో పాటు కార్యకర్తలు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

దేశానికి కేసీఆర్.. నర్సాపూర్‌కు మదన్‌రెడ్డి


సీఎంకేసీఆర్, ఎమ్మెల్యే మదన్‌రెడ్డిలతో ఏర్పాటు చేసిన కటౌట్‌లు

వెల్దుర్తి(తూప్రాన్): వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థుల వివరాలను మూడు రోజుల క్రితం సీఎం కేసీఆర్ ప్రకటించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ అభ్యర్థి విషయం పెండింగ్‌లో ఉంచారు. దీంతో దేశానికి సీఎం కేసీఆర్, నర్సాపూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కావాలంటూ రూపొందించిన కటౌట్‌లతో మండలంలోని మానెపల్లి గ్రామం నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు మెదక్ సీఎం సభకు తరలివెళ్లారు. నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మదన్‌రెడ్డికే అవకాశం ఇవ్వాలన్నారు.

వచ్చేది డబుల్ ఇంజిన్ సర్కారే

- బీజేపీ కర్ణాటక ఎమ్మెల్యే శరణు సలగర్

పెద్దశంకరంపేట(మెదక్): రాబోయే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో వచ్చేది బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారేనని కర్ణాటక రాష్ట్ర బసవకళ్యాణ్ బీజేపీ ఎమ్మెల్యే శరణు సలగర్ అన్నారు. బుధవారం పట్టణంలో ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్పలతో కలిసి బూత్ లెవల్, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశం ఎంతో ముందుకు వెళ్లిందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ దళితబంధు, మైనార్టీ బంధుల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.


బీజేపీ చేరుతున్న సర్పంచ్ సుధాకర్

బీజేపీలోకి బీఆర్ఎస్ సర్పంచ్

మండల పరిధిలోని టెంకటి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ సుధాకర్, 50 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోణం విఠల్, నాయకులు శ్రావణ్, సాయిలు, కృష్ణ, సంగమేశ్వర్, జనార్దన్, రవి తదితరులున్నారు.

రోడ్డుపై విద్యార్థుల ఆందోళన

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నర్సాపూర్ మీదుగా మెదక్ వెళ్తున్న సీఎం కేసీఆర్ కాన్వాయ్ అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఎన్ఎస్‌యుఐ విద్యార్థులు, యూత్ కాంగ్రెస్ నాయకులు నర్సాపూర్ బస్టాండ్ సమీపంలో రోడ్డుపై బైఠాయించి కేసీఆర్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఎన్ఎస్‌యూఐ విద్యార్థి నాయకులను అరెస్టు చేసి శివ్వంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షులు ఆంజనేయులు, సునీల్‌యాదవ్, ప్రశాంత్, ప్రసాద్, యూత్ కాంగ్రెస్ నాయకులు రిజ్వాన్, సందీప్, భాస్కర్, మల్లేశం, నరేశ్ తదితరులు ఉన్నారు.


రోడ్డుపై బైఠాయించిన ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు

డివిజన్ మంజూరు తమ పోరాట ఫలితమే

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం దీర్ఘకాలంగా తాము అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాట ఫలితమే ప్రభుత్వం డివిజన్ మంజూరు చేసిందని పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు పేర్కొన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఆరేళ్లుగా తాము దీక్షలు, బంద్‌లు, రాస్తారోకోలు నిర్వహించామన్నారు. దీనికి తోడు తాను స్వయంగా రామాయంపేటలో ఆమరణ దీక్ష చేపట్టానని ఆయన గుర్తు చేశారు. ఏళ్ల తరబడి ఆందోళనలు, దీక్షలు కొనసాగుతుండగా, దిగివచ్చిన ప్రభుత్వం డివిజన్ మంజూరు చేసిందని సుప్రభాతరావు స్పష్టం చేశారు. ఇందుకుగాను పట్టణ ప్రజలు ఎంతగానో సహకరించారని ఆయన పేర్కొన్నారు. ఆలస్యంగా నైనా డివిజన్ ప్రకటించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.